# ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు


కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

- ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం ఉండకూడదు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- సీపీతో కలిసి కౌంటింగ్ సెంటర్ల పరిశీలన
- రిటర్నింగ్ అధికారులతో సమీక్ష

ఖలీల్‌వాడి, డిసెంబర్ 2 : జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేడు (ఆదివారం) కొనసాగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కలెక్టర్ శనివారం సీపీ కల్మేశ్వర్‌తో కలిసి కౌంటింగ్ సెంటర్లను పరిశీలించి, ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లలో ఏర్పాటు చేసిన టేబుళ్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు కలెక్టర్ తన చాంబర్‌లో ఆరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఉదయం 5 గంటలకు పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ జరిపించాలని ఆర్వోలకు సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఈవీఎంల ఓట్లను రౌండ్ల వారీగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే, సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యదాతథంగా కొనసాగించాలని అన్నారు. పాస్‌లు ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్‌లోనికి అనుమతించాలని సూచించారు.

**కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్..**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలను సీల్ చేసి జిల్లా కేంద్రంలోని గోడౌన్‌కు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. జిల్లాలోని ఆరు సెగ్మెంట్లకు సంబంధించి మొత్తం 122 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 131 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 123 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వీరికి ఇప్పటికే పలు విడుతల్లో మాస్టర్ ట్రైనర్లతో కౌంటింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించామని వివరించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజ్ ఉన్నారు.

**రౌండ్ల వారీగా..**

ఆర్మూర్ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు 16 రౌండ్లలో పూర్తి కానున్నది. బోధన్ 18, బాన్సువాడ 19, నిజామాబాద్ అర్బన్ 21, నిజామాబాద్ రూరల్ 21, బాల్కొండ 18 రౌండ్లలో లెక్కించనున్నట్లు వివరించారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


రాములు(ఫైల్)

తాడ్వాయి, డిసెంబర్ 2: వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటనలు మండలంలో చోటుచేసుకున్నాయి. తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేమికలాన్ గ్రామానికి చెందిన కుంట రాములు(44) కామారెడ్డిలో బంధువుల వివాహం ఉండడంతో శుక్రవారం ఉదయం వెళ్లాడు. రాత్రి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్న సమయంలో తాడ్వాయిలోని కాలేజీ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని చికిత్స కోసం కామారెడ్డికి తరలించగా.. పరిస్థితి విషమించి మరణించాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

***ఎర్రాపహాడ్ శివారులో కరీంనగర్ జిల్లా వాసి..***

కరీంనగర్ జిల్లా అల్మాస్‌పుర గ్రామానికి చెందిన సత్తయ్య లింగంపేట మండలం నల్లమడుగు గ్రామంలో ఉన్న తమ బంధువుల వద్దకు శుక్రవారం వెళ్లాడు. శనివారం ఉదయం స్వగ్రామానికి బైకుపై బయల్దేరాడు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ శివారులోకి రాగానే మోతె బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో ఆయన అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి, కుటుంబీకులకు సమాచారం అందించామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కారు ఎర్రాపహాడ్‌కు చెందిన వ్యక్తిదని గుర్తించామని, డ్రైవర్ పరారీలో ఉన్నాడన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

## జంబిహనుమాన్ ఆలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్2: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.


సెంట్రల్ లైట్లతో పట్టణాన్ని తలపిస్తున్న ఏర్గట్ల

# ఏర్గట్లకు కొత్తందం

ఏర్గట్ల, డిసెంబర్ 2: మండల కేంద్రంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో పూర్తయిన సెంట్రల్ లైటింగ్‌సిస్టం గ్రామానికి కొత్తందాన్ని తీసుకొచ్చిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం రూ. 5 కోట్లతో ప్రారంభమైన సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ, డివైడర్ పనులు పూర్తయ్యాయి. రోజూ రాత్రి సమయంలో లైట్లు విరజిమ్ముతూ పట్టణాన్ని తలపిస్తోందని గ్రామస్తులు అంటున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసిన మంత్రికి ఏర్గట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# కొనసాగుతున్న పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణ పనులు

బాల్కొండ, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన పక్కన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో రూ.5 లక్షల వ్యయంతో పబ్లిక్ టాయిలెట్స్ పనులు కొనసాగుతున్నాయి. నిత్యం ఎంతో మంది ప్రజలు వివిధ గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి పోతుంటారు. దగ్గరలో ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై ప్రజలు వస్తుంటారు. వారి ఇబ్బందులను గ్రహించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో రెండు టాయిలెట్స్ మహిళలకు, రెండు టాయిలెట్స్ పురుషుల కోసం నిర్మిస్తున్నారు. నెల క్రితం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఈపనులకు భూమిపూజ చేశారు. ప్రజలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.


పూర్తయిన స్లాబు నిర్మాణం

# ఉన్ని దుస్తులకు భలే గిరాకీ


నగరంలోని ఉన్ని దుస్తుల దుకాణం వద్ద వినియోగదారుల సందడి

- జిల్లాలో పెరిగిన చలి తీవ్రత
- జోరందుకున్న స్వెట్టర్ల విక్రయాలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 2 : జిల్లాలో ఒక్కసారిగా చలితీవ్రత పెరిగింది. దీపావళి పండుగ నుంచి రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 17 డిగ్రీలకు పడిపోతున్నాయి. పగలంతా ఎండ ఉంటున్నప్పటికీ సాయంత్రం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడుతున్నది. చలి నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు ఉన్ని దుస్తులను కొనుగోలు చేస్తున్నారు. వెరైటీ స్వెట్టర్లు నేపాల్, టిబెట్ నుంచి వచ్చిన వ్యక్తులు నగరంలోని డెయిలీ, వీక్లీ మార్కెట్లతో పాటు పలు ప్రాంతాల్లో స్వెట్టర్లను విక్రయిస్తున్నారు. బట్ట షాపుల్లో కన్నా వీరి వద్ద వివిధ రకాల ఉన్ని దుస్తువులు అందుబాటులో ఉన్నాయి. జర్కిన్స్, ఉలెన్ షూస్, గ్లౌజ్స్, మంకీక్యాపులు, స్వెట్టర్లు, మఫ్లర్లు విక్రయిస్తున్నారు. చిన్నపిల్లల స్వెట్టర్లు రూ. 150 నుంచి రూ. 300 వరకు, మహిళల ఉన్ని దుస్తులు రూ. 100 నుంచి రూ. 400 వరకు, వృద్ధుల స్వెట్టర్లు రూ. 200 నుంచి 500 వరకు, మంకీ క్యాప్‌లు రూ. 50 నుంచి రూ.150 వరకు, జర్కిన్లు రూ. 200 నుంచి రూ. 800 వరకు విక్రయిస్తున్నారు. ఇవేకాక వివిధ వెరైటీ ఉన్ని దుస్తువులును విక్రయిస్తున్నారు.

# నిలకడగా నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

నిజాంసాగర్, డిసెంబర్ 2: నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా ఉన్నదని ప్రాజెక్టు ఏఈ శివకుమార్ శనివారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగుల (17.80 టీఎంసీల)కు గాను శనివారం సాయంత్రానికి 1403.88 అడుగులు (16.19 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు. ఆయకట్టు కింద యాసంగి పంటల సాగు కోసం రైతన్నలు తూకాలు వేసేందుకు సిద్ధం అవుతుండగా అందుకు అనుగుణంగా నీటి విడుదలను త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో డీఐబీ సమావేశం ఏర్పాటు చేసి, సమావేశంలో తీర్మానం ప్రకారం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తామని తెలిపారు.


శనివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ